క్లుప్తంగా

లలితా త్రిపురసుందరీ దేవిగా...



లలితాత్రిపురసుందరీదేవీ అలంకరణలో కనక మహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవీగా భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.అనంతరం దేవ స్థానం మండపంలో భక్తులతో అర్చకులు కుంకుమ పూజలు చేయించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



హోమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి శ్రీనివాస్

బొండపల్లి: మండలంలోని ముద్దూరులో గ్రామదేవత బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహిం చారు. వేదపండితులు ప్రత్యేకపూజలు, హోమాలు చేశారు. రాష్ట్ర చిన్న,మధ్య తరహా పరిశ్రమలు,సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. వేదపండితులు ఆయనకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారిని దర్శించుకుని , యాగశాలలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మునకాల పైడిపు నాయుడు, నాయకులు కల్యాణపు నారాయణరావు, కోరాడ కృష్ణ,బండారు బాలాజీ, బాలి మన్మదరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అధ్యక్షతన సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి పింఛన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, తదితర వినతులు స్వీకరించారు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వినతిని ఆయా శాఖలకు పంపి, సరైన విచారణ చేసి, సత్వర న్యాయం అందేలా చూస్తామని చెప్పారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, తహసీల్దార్ అరుణకుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసారపరీక్షలపై అవగాహన



జవహర్ నవోదయ విద్యార్థులకు మట్టినమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఆత్మ సిబ్బంది

శృంగవరపుకోట: సోయిల్ స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రభుత్వ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విజయనగరం ఏటీఎంఏ(ఆత్మ) ఎగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ నేతృత్వంలో కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు భూసారపరీక్షలు, వఉపయోగాలపై సోమవారం అవగాహన కల్పించారు. భూసార పరీక్షల్లో మట్టి నమూనాల సేకరణకు గుంతలు ఎలా తవ్వాలి, మట్టి నమూనాలు ఎలా సేకరించాలనే అనే అంశంపై ఆత్మ ఏఓ లీలావాణి స్కూల్ ప్రాంగణంలో ప్రయోగాత్మకంగా వివరించారు. మట్టి పరీక్షల వల్ల ఉపయోగాలు, భూమి ఆరోగ్యంలో పోషకాల ప్రాముఖ్యతను, భూమిలో తక్కువగా ఉన్న ఖనిజ, పోషకాలను ఎలా భర్తీ చేయాలన్న విషయాలను విద్యార్థులకు వివరించారు. కొత్తవలస ఏడీఏ విజయ, ఆత్మ సిబ్బంది స్రవంతి తదితరులు హాజరయ్యారు.

భారీ వర్షం



ఎం.వెంకటాపురంలో రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

గజపతినగరం: మండల కేంద్రంలో పాటు చుట్టు పక్క గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయ మయ్యాయి. ఎం.వెంకటాపురంలో ఈదురు గాలులకు రోడ్డుపై భారి వృక్షం కూలిపడడంతో కాసేపు రాకపోకలకు ఆటంకం కలిగింది. స్థానికులు చెట్టును తొలగించడంతో మళ్లీ యథావిధిగా రాకపోకలు సాగాయి. పురిటిపెంటలోని బాలాజీ నగర్ కాలనీలో వరద నీరు నిలిచి పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎం.వెంకటాపురం బీసీ కాలనీలో ఐ.సత్యవతికి చెందిన పూరి గుడిసె ముంపునకు గురయ్యింది.

ముద్దానపేట గ్రామస్తుల కల నెరవేరేనా..?

- నిలిచిన ముద్దానపేట తారురోడ్డు పనులు
- రూ.1.04 కోట్లతో గత ప్రభుత్వంలో మంజూరైన బీటీ రోడ్డు
- ఎర్త్‌వర్క్, జంగిల్ క్లియరెన్స్ చేశాక వచ్చిన ఎన్నికల కోడ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక ముందుకు సాగని పనులు



అధ్వానంగా ఉన్న ముద్దానపేట- పెదమానాపురం మట్టి రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని ముద్దానపేట గ్రామస్తుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. వారి ఎన్నో ఏళ్ల కల కలగానే మిగిలి పోనుందా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అలాగే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామానికి ప్రారంభమైన తారురోడ్డు పనులు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయాయి. మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన స్పందించి పెదమానాపురం గ్రామం నుంచి ముద్దానపేటకు బీటీరోడ్డు మంజూరు చేయించారు. రెండున్నర కిలోమీటర్ల మేర 30 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం, మినీ కల్వర్టులు, పైపులైన్ కానాలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేయడంతో ప్రభుత్వం ఏపీఆర్ఆర్‌పీ నిధులు రూ.1.04 కోట్లు మంజూరు చేసింది. అప్పటిలో మండల ప్రజాప్రతిని ధులు భూమిపూజ చేసి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. మట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుంప లు, డొంకలను తొలగించడంతో పాటు ఎర్త్‌వర్క్ పనులు చేయించారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈరోడ్డు పనుల సంగతే పూర్తిగా మరచిపోయింది.భారీ వర్షాలు కురిసే సమయంలో పంట పొలాల నుంచి వరద నీరు మట్టి రోడ్డు మీదుగానే ప్రవహిస్తుంటుందని, ఆ సమయంలో రాకపోకలు సాగించలేకపోతున్నామని గ్రామస్తులు అంటున్నారు. తారు రోడ్డు నిర్మాణం పూర్తయితేనే తమ ఇబ్బందులు తీరుతాయని పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పనులపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పనులకు గత ప్రభుత్వ హయాంలో భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

మహాసభలను విజయవంతం చేయండి

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు విద్యార్థులను కోరా రు. మహాసభల ఆహ్వాన కరపత్రాలను పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమ వారం విడుదల చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా సభల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నవంబర్ 27న భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజ రు కావాలని కోరారు. విద్యారంగ సమస్యలను చర్చించి ఉద్యమానికి సన్నద్ధమవ్వడమే ధ్యేయంగా నిర్వహిస్తున్న సభలకు ఏఐఎస్ఎఫ్ ఆలిండియా నాయకులు హాజరవుతారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యా వ్యతిరేక కార్యక్రమాలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అభివృద్ధే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట: అభివృద్ధే అందరి లక్ష్యం కావాలని, ఎస్.కోట పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపే దిశగా పంచా యతీ పాలకవర్గం ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపు ఇచ్చారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోష్ కుమారి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబడి విషయంలో ఎస్.కోట పంచాయతీ బాగా వెనుకబడి ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు సకాలంలో ఇవ్వలేని పరిస్థితి ఉందని, దీనిని అధిగమించేందుకు రాబడి వచ్చే మార్గాలు అన్వేషించి, వాటిని అమలుపరిచి పంచాయతీని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ఇదే సమయంలో వైస్ సర్పంచ్ మోపాడ కుమార్ మాట్లాడుతూ ఎస్.కోట పట్టణంలో ఉన్న పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్తవి కట్టి కేటాయింపులకు బహిరంగ వేలం నిర్వహించాలని, ఇలా ఎన్నో ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా సమగ్ర అభివద్ధి ప్రణాళిక సిద్ధం చేసి, పంచాయతీ ఆదాయం పెంచాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ దుకాణాల పన్నులు పెంచాలా, కొత్త దుకాణాల నిర్మాణం చేపట్టాలా అన్న విషయంపై రాజకీయాలకు అతీతంగా పంచాయతీలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటే దానినే అమలు చేస్తామని పేర్కొన్నారు. పంచాయతీ షాపింగ్ నిర్మాణాలకు దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. పంచాయతీలో సమస్యలను ఇప్పటికే అధికారుల ద్వారా గుర్తించామని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, వైస్ సర్పంచ్ కుమార్, ఈఓపీఆర్డీ లక్ష్మి, పంచాయతీ ఈఓ అనురాధ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



జామి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సరయు



గంట్యాడ: మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్



గజపతినగరం: మాట్లాడుతున్న జెడ్పీటీసీ తవుడు

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లతో పాటు ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు సమన్వయంతో పని చేయాలని అధికారులు ఎంపీపీలు, జెడ్పీటీసీలు సూచించా రు. 2024- 25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికలపై గంట్యాడ, జామి, గజపతినగరం మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీ సమావేశాలు, పారిశుద్ధ్య, ఘన వ్యర్థాల నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టాలు,వీధి దీపాల ఏర్పాటు, తాగునీటిసరఫరా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గంట్యాడలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఈఓపీఆర్డీ భానోజీరావు, జామిలో ఎంపీపీ సబ్బవరపు అరుణ,జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ శ్రీదేవి, గజపతినగరంలో జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ బి.కల్యాణి, ఈఓపీఆర్డీ బి.సుగుణాకర రావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లాన త్రినాథరావు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. – గంట్యాడ/జామి/గజపతినగరం

విధులకు డుమ్మా..!

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలు గాడి తప్పుతున్నాయి. పర్యవేక్షణ కొరవడడంతో కేంద్రాల నిర్వాహణ ఇష్టారీతిగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలుగ్రామాల్లో విధులకు అంగన్‌వాడీ కార్యకర్తలు డుమ్మా కొడుతుండడంతో, వారి విధులను సైతం ఆయాలే నిర్వర్తించాల్సి వస్తోంది.మండలంలోని సిరిపురం గ్రామంలో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం ఉదయం 9:40 గంటలకు పిల్లలు ఆయాలే ఉన్నారు. కార్యకర్తలు హాజరు కాలేదు. 10 గంటల ప్రాంతంలో లక్కిడాం అంగన్‌వాడీ కేంద్రం-1లో ముగ్గురు పిల్లలు, ఆయా మాత్రమే ఉన్నారు. కార్యకర్త రాలేదు. అదే గ్రామంలో కేంద్రం-2లో 10:10 గంటలకు ఆయా, ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. కేంద్రం-3లో 10:15 గంటలకు ఆయా మాత్రమే ఉంది. పిల్లలు, కార్యకర్త రాలేదు.10:30 గంటలకు కేంద్రం-4లో ఇద్దరు పిల్లలు, ఆయా మాత్రమే ఉన్నారు. కార్యకర్త రాలేదు. గంట్యాడ ఎస్సీ కాలనీలోని కేంద్రంలో 11 గంటలకు పిల్లలు, కార్యకర్త, ఆయా ఎవరూ లేరు. రామవరం కేంద్రం-3లో 11:30 గంటలకు కార్యకర్త, ఆయా, ఒక్క చిన్నారి మాత్రమే ఉన్నారు. కార్యకర్తలు కేంద్రాలకు ఇలా డుమ్మా కొడుతుండడంతోనే కేంద్రాలకు హాజరయ్యే పిల్ల సంఖ్య తగ్గిపోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 10 మంది పిల్లలు ఉండాల్సిన కేంద్రంలో ముగ్గురు, నలుగురు మాత్రమే ఉంటున్నారు. 6 నుంచి 8 మంది పిల్లలు ఉండాల్సిన కేంద్రాల్లో ఒకరిద్దు మాత్రమే ఉంటున్నారు. ఈ విషయాన్ని గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ డోకుల ఉమా భారతి వద్ద సాక్షి ప్రస్తావించగా కేంద్రాలకు హాజరు కాని కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఎందుకు తగ్గారో విచారణ చేస్తామని చెప్పారు.



గంట్యాడ ఎస్సీ కాలనీలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భవానీ మాలధారణ చేసిన భక్తులు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లేందుకు ఎస్.కోట ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు ప్రత్యే క బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డీఎం కె.రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తిగా బస్సు బుక్ చేసుకుంటామనుకున్న వారికి వారి పీఠం వద్దకే బస్సులు పంపుతామని పేర్కొ న్నారు. భక్తుల కోరిక మేరకు ద్వారకాతిరుమల, ద్వారపూడి, అన్నవరం, సింహాచలం క్షేత్రాల మీదుగా విజయవాడకు సర్వీసులు నడుపుతామని, వీటిలో ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా డీలక్స్, పల్లెవెలుగు సర్వీసులు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్యాకేజీ బస్సులు కావాలిన్న వారు 73829 23679, 94905 83579 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

కోటగంద్రేడులో డయేరియా

గుర్ల: మండలంలోని కోటగంద్రేడులో డయేరియా విజృంభిస్తోంది. గ్రామంలో సుమారుగా 20 మంది డయేరియాతో బాధపడుతూ వారం రోజులుగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాగునీరు కలుషితం కావడంతోనే డయేరియా కేసులు నమోదవుతున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. మరోవైపు గ్రామ ప్రవేశమార్గం బహిర్భూమిగా వినియోగించడం, చెత్తాచెదారాలు వేయడం కూడా వ్యాధుల వ్యాప్తికి కారణంగా పేర్కొంటున్నారు. గుర్ల ఎస్సీ కాలనీలోనూ నలుగురు వ్యక్తులు డయేరియా బారిన పడ్డారు. గుర్ల, కోటగంద్రేడులో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నయ్ తెలిపారు. గుర్ల, కోటగంద్రేడులో చికెన్, చేపలు, మటన్ వ్యర్థాలు ఇష్టారాజ్యంగా పడేయకుండా చూడాలని పంచాయతీ అధికారులకు తెలియజేశామన్నారు.

10న మండల సర్వసభ్యసమావేశం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

మెరకముడిదాం: మండలానికి బదిలీపై వచ్చిన పలువురు రెవెన్యూ అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా జి.వి.భాస్కరరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా బి.టి.ఆర్.కె.నాయుడు తహసీల్దార్ అజురఫీజాన్ సమక్షంలో విధుల్లో చేరారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించండి



ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: గ్రామాల్లో పారిశుద్ధ్య, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఇటీవల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రప్రసాద్‌ను మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు,టి.భూర్జవలస సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, ఎంఎంసీ మాజీ చైర్మన్ మండల శ్రీను, దత్తిరాజేరు మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు తదితరులు ఎంపీడీఓను కలిసిన వారిలో ఉన్నారు.

నిర్మాణ రంగాన్ని నీరుగార్చకండి



ప్రజాదర్బార్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

శృంగవరపుకోట: ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని, దీంతో నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్న వేలాది కుటుంబాలు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాయని సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీ యూ నేతృత్వంలో ట్రాక్టర్స్, జేసీబీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. అక్కడి నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ వేదిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే లలితకుమారి, తహసీల్దార్ అరుణకుమారిని కలిసి సమస్యను వారికి వివరించడంతో పాటు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆందోళనకారులు, సీఐటీయూ నేతలు మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌లు వెంటనే తెరిపించాలని, టోల్‌గేట్ వద్ద పునాదిరాయి, మట్టికి వసూళ్లు చేస్తున్న ఫీజులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు ఉద్యోగాలు కల్పించలేక పోవడం వల్ల నిరుద్యోగం పెరిగిందని, అటువంటి వాళ్లంతా ట్రాక్టర్లు, జేసీబీలు, వ్యాన్‌లు నడుపుతుండగా, పెయింటర్లు, రాడ్‌బెండర్లు, కార్పెంటర్లు, సెంట్రింగ్ వర్కర్లు, ఇంటీరియర్లు, బ్రిక్ వ్యాపారులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లుగా, క్వారీలు, క్రషర్లలో ఆపరేటర్లుగా, వర్కర్లుగా, తాపీమేస్త్రిలు, కూలీలుగా ఇలా పలువిధాలుగా నిర్మాణరంగాన్ని నమ్ముకుని బతుకుతున్నారన్నారు. ఇప్పుడు ఇసుక లభ్యత లేక, వీళ్లంతా రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మాణరంగాన్ని విస్మరిస్తే రైతన్నల మాదిరిగా వీళ్లకీ ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని, ఈ పరిస్థితిని వెంటనే నివారించాలని డిమాండ్ చేశారు. విజయదుర్గ ట్రాక్టర్స్, జేసీబీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ వాకాడ భరత్, వైస్‌ప్రెసిడెంట్ గేదెల శ్రీను, సెక్రటరీ గంగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్.ముత్యాలు, వి.అప్పారావు, కె.సన్నిబాబు, మంచిన రాము, దొరబాబు తదితరులలు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ బాధ్యతలపై అమరావతిలో శిక్షణ



అమరావతిలో శిక్షణకు హాజరైన ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) విధులు, బాధ్యతలపై అమరావతిలో జరుగుతున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల నుంచి పలువురు ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎస్ఎంసీ విధులు, బాధ్యతలపై ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను అమరావతిలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణకు మండలానికి ఒక ఎస్ఎంసీ చైర్మన్, ఒక్కో ఉపాధ్యాయుడిని ఎంపిక చేశారు. చీపురుపల్లి మండలం నుంచి బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గవిడి సురేష్, పేరిపి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవి కిశోర్‌తో పాటు మెరకముడిదాం మండలం నుంచి ఎస్ఎంసీ చైర్మన్ కోట్ల ఎల్లంనాయుడు, ఊటపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.రమేష్ హాజరయ్యారు. అక్కడ శిక్షణ ముగిసిన అనంతరం చీపురుపల్లి డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో ఉన్న ఎస్ఎంసీ చైర్మన్లకు, ఉపాధ్యాయులకు వీరు శిక్షణ ఇవ్వనున్నారు.

చీడపీడల నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు

బొండపల్లి: పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, చీడపీడల నివారణపై క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ)కు గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు సూచించారు. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల పరిధి రైతు సేవా కేంద్రాల వీఏఏలకు జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల సాగు, చీడపీడల నివారణపై స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తూ తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను రైతులకు సూచించాలని చెప్పారు. అలాగే రైతులకు మెలకువలు నేర్పుతూ, వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్,జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భారతి, ఏఓ గోవిందమ్మ, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ ఏఓలు మల్లికార్జునరావు, ధనలక్ష్మి, లోకేష్, గోకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి



కొత్తవలస: తహసీల్దార్ నీలకంఠరావుకి వినతిపత్రం అందజేస్తున్న సూర్యారావు, తదితరులు


కొత్తవలస/ వేపాడ: ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు సూచించారు. సమాచార హక్కు చట్టం తీసుకొచ్చి19 ఏళ్లు పూర్తవుతున్న సంద ర్భంగా కొత్తవలసలోని తహసీల్దార్,ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్, ఉపాధి హామీ తదితర కార్యాలయాల్లో, వేపాడ ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం అమలు తీరు, అవగాహన బోర్డులను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ సమాచారహక్కు చట్టంవచ్చి 19 ఏళ్లు అవుతున్నా క్షేత్రస్థాయిలో అమలు తీరు అంతంత మాత్రంగానే ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరు, అప్పీలేట్ అధికారుల ఫోన్ నంబర్లు తదితర 17 అంశాలతో కూడిన బోర్డులు పూర్తిస్థా యిలో లేవని, బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమాచార హక్కుచట్టం ఉద్యమకారులు ఎల్.సాంబమూర్తి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- పలు గ్రామాల్లో దేవీ మండపాల వద్ద అంబలం పూజలు



శృంగవరపుకోట: లచ్చంపేటలో నిర్వహించిన అంబలం పూజలో భవానీలు



లక్కవరపుకోట: ఎల్.కోటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

శృంగవరపుకోట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉత్సవాల్లో అయిదో రోజైన సోమవారం మండలంలోని లచ్చంపేట, లక్క వరపుకోట మండలంలోని సీతగొర్లెవానిపాలెం, దేవాడ తదితర గ్రామాల్లో దుర్గాదేవి పీఠాల వద్ద అంబలం పూజలు వైభవంగా నిర్వహించారు. అరటి దవ్వలతో కట్టిన మండపాల్లో వినాయకుడు, శివపార్వతులు, దుర్గమ్మ తల్లి విగ్రహమూర్తులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. భజన కార్యక్రమాల్లో వందలాది మంది భవానీ మాలధారణ భక్త లు పాల్గొన్నారు.లచ్చంపేటలో వేదపండితులు మధుకుమార్ శర్మ, నేతృత్వంలో మనోజ్ శర్మ, భైరవవర్మ అంబల పూజ జరిపించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ వారు అమ్మవారి వద్ద నైవేద్యంగా సమర్పించిన 11కిలోల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా వేపాడ మండలంలోని మైచర్ల సింగవరం గ్రామస్తుడు కసిరెడ్డి జగన్నాథరావు రూ.1,01,001లకు దక్కించుకున్నారు.

మహా చండీదేవిగా దర్శనం

బొండపల్లి/దత్తిరాజేరు/జామి/ కొత్తవలస/లక్కవరపుకోట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు సోమవారం అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొండపల్లి మండలంలోని దేవుపల్లి రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ భక్తులతో కుంకుమ పూజలు చేయిం చారు. దత్తిరాజేరు మండలంలోని గడసాం, మరడాం,కోమటిపల్లి, పెదమానాపురం,కొత్తవలస మూడు రోడ్ల జంక్షన్‌లోని మండపంలో పురోహితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. జామి బస్టాండ్ వద్ద ఆటోయూనియన్ ఏర్పాటు చేసిన మండపం వద్ద సుమారు నాలుగు వేలమంది భక్తులకు అన్నదానం చేశారు. ఎల్.కోట సీతారామ ఆలయ ప్రాంగణంలో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.



బొండపల్లి: దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలోపూజలు చేస్తున్న భక్తులు



జామి: జామి బస్టాండ్ వద్ద మండపంలో మహాచండీదేవిగా దర్శన మిస్తున్న అమ్మవారు